వజ్రపుకొత్తూరును కరువు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలంలో వర్షాలు పూర్తి లేకపోవడంతో ఖరీఫ్ కాలంలో రైతులు వేసిన వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయని, సాగు నీరు లేక పొలాలు బీటలు మారిపోయాయని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, మండల సిపిఐ నాయకులు వంకల ముకుంద, భాస్కరరావు, ఏఐటీయూసీ నాయకులు చిక్కాల గోవిందరావు, కామేశ్వరరావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు పూర్తిగా పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, వంశధార నీరు శివారు భూములకు అందించేందుకు పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వజ్రపుకొత్తూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కంటకాపల్లి రైలు ప్రమాద ఘటన బాధాకరం

ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్టేరు డివిజన్ స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు పొన్నాడ రవికుమార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాద ఘటన ఎంతో బాధాకరమని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్టేరు డివిజన్ స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు, లైయిన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఘటనలో మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాద ఘటన సంభవించినప్పుడు యుద్ధ ప్రాతిపదికన రైల్వే యంత్రాంగం, ప్రభుత్వ సిబ్బందితోపాటు అన్ని వ్యవస్థలు చక్కగా స్పందించడం వల్ల తక్షణ సహాయంతో పాటు బాధితులకు ఉత్తమ వైద్య సేవలు అందాయన్నారు. మూడు జిల్లాలకు చెందిన రైల్వే యంత్రాంగం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో తక్షణ సేవలు అందించడం వలన ప్రమాద తీవ్రత తగ్గించగలిగి బాధితులని గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించగలిగారన్నారు. ఇలాంటి ప్రమాద ఘటనలు జరిగినప్పుడు అటు బాధితులకు ఇటు యంత్రాంగానికి సమాజం కూడా స్పందించి అండగా నిలవాలని పొన్నాడ రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

కరువు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర-మందస : వర్షాలు పూర్తిగా లేకపోవడంతో వరి పంటలు ఎండిపోయాయని, సాగునీరు లేక పొలాలు బీటలుగా మారిపోయాయని మందస మండల మహేంద్ర రైతు సంఘం మహేంద్ర రైతు సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు మందస తహశీల్దార్ బి.పాపారావుకు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మందస మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడానికి చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో కోరారు. రైతాంగానికి పంట నష్ట పరిహారం చెల్లించాలని రైతు కుటుంబాలకు ఉపాధి కల్పించాలని, వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.కామేశ్వరరావు, కె.హేమారావు చౌదరి, జగన్నాథ బెహరా, ఎం.బాబూరావు, సోమనాథం, ఎన్.హడ్డి, కె.పాపారావు, యు.రాజారావు, వీరాస్వామి, తవిటయ్య, చంద్రయ్యలు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి వైద్యమందించడమే జగనన్న సురక్ష లక్ష్యం

- ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి: ప్రతి పేద కుటుంబానికి వైద్యం అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని జగతి గ్రామ సచివాలయ పరిధిలో స్థానిక సర్పంచ్ పూడి వరప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవాడు డబ్బు లేక వైద్యానికి దూరంగా ఉండకూడదని ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఆంధ్రప్రదేశ్ లో ప్రతి కుటుంబం ఇంటి వద్దకే నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యం అన్నారు. ఈసందర్భంగా అంగన్వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్స్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, తాసిల్దార్ పి శేఖర్, డిప్యూటీ తాసిల్దార్ రామచంద్రరావు,సిడిపిఓ నాగరాణి, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, బోరివంక ఎంపీటీసీ సభ్యులు సతీష్, గ్రామస్తులు దిక్కల బాబురావు,భావన రవి,పూడి మౌర్య సారథి, పూడి లోకనాథం, పంచాయతీ కార్యదర్శి ఏ విజయ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవి రమణమూర్తి, వైద్యాధికారిణి మాదిన హరిత, వైద్య బృందం, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు, రెవెన్యూ సిబ్బంది,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో సమాజానికి చేటు : కమిషనరు రవిసుధాకర్

విశాలాంధ్ర-ఆముదాలవలస : ఆధునిక సమాజంలో బాల్యవివాహాలు అభివృద్ధికి విఘాతమని మునిసిపల్ కమిషనరు ఎం.రవిసుధాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై చర్యలలో భాగంగా సోమవారం మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. కొందరు తల్లిదండ్రులు చేస్తున్న అనాలోచిత బాల్య వివాహాల నిర్ణయాలతో సమాజానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. ఈదిశగా ప్రభుత్వం నిర్దేశించిన వయోపరిమితికి లోబడి మాత్రమే వివాహాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. బాల్య వివాహాల అంశం చాలా సునిశితమైనదని, వీటి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మీనారాయణ బిశాయ్, సి.హెచ్ శ్రీనివాసరావు, ఏ.వి శ్రీనివాస్ తదితర వార్డు సచివాలయ పరిపాలనా, ఆరోగ్య, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపయోగపడే పనుల కోసం ఎందుకు ఆలోచన

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలో ప్రజలు తీవ్రమైన నీటి కొరతను ఇప్పటికీ ఎదుర్కోవడం సరికాదని పలువురు కౌన్సిలర్లు గొంతెత్తారు. పన్నుల భారం ఒక్కసారిగా ప్రజలపై మోపితే మళ్ళీ ప్రజల మధ్యకు వెళ్ళ లేమని అన్నారు. సోమవారం మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్ సమన్వయంతో ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీలో ప్రజలకు సరైన త్రాగునీటిని అందివ్వలేకపోతున్నామా? అని 23వ వార్డు కౌన్సిలర్ ప్రదీప్ ప్రశ్నించారు. స్పందించిన కమీషనర్ బాహుదా నదిలో ఊట బావుల్లోకి బురద చేరిపోయిందని, వాటిని శుభ్రపర్చడానికి దాదాపు 8లక్షల వరకూ ఖర్చు కాగలదని అన్నారు. అందుకు ప్రతిగా పలువురు కౌన్సిలర్లు ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టడానికి వేరే ఆలోచన ఎందుకని, తక్షణం ఆ పనులు చేపట్టాలని కోరారు. అందుకు కౌన్సిల్ ఆమోదించింది. కోతులు పట్టుకుని నాలుగు రోజులకే పని మధ్యలో ఆపేసారని సభ్యులు ప్రశ్నించగా అటవీశాఖ అభ్యంతరాలను అధిగమించాక తిరిగి కోతులు పట్టే పని ప్రారంభం అవుతుందని కమీషనర్ చెప్పారు. పురుషోత్తపురంలో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు జరిగినా ఇంకా ప్రారంభించడపోవడం విచారకరమని 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ అన్నారు. ప్రజారోగ్య విభాగం ట్రాక్టర్ మరమ్మత్తులకు 90వేలు కేటాయిస్తు కౌన్సిల్ ఆమోదించింది.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

- వడ్డీ తాత కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శిస్తారు
- టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

విశాలాంధ్ర-పొందూరు: టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుతో తీవ్ర మనస్థాపానికి గురై మృతిచెందిన వడ్డీ తాతయ్య కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ చెప్పారు. కింతలి పంచాయతీ ఖాజీపేటలో వడ్డి తాతయ్య కుటుంబాన్ని సోమవారం రవికుమార్ పరామర్శించారు. టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచి పార్టీకోసం కష్టపడిన కార్యకర్తని, చంద్రబాబు ను అమితంగా తాతయ్య అక్రమఅరెస్టును జీర్ణించుకోలేక మనస్థాపంతో ఆనారోగ్యానికి గురికావడం ఆపై మృతిచెందడం బాధాకరమని అన్నారు. ఇటువంటి నిబద్ధత కలిగిన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉన్న చరిత్ర టీడీ పీదని చంద్రబాబుసతీమణి భువనేశ్వరి తాతయ్య కుటుంబాన్ని పరామర్శించే అవకాశం ఉందన్నారు. రవికుమారతో పాటు సర్పంచ్ పైడి ప్రసాద్, ఎంపిటీసి హనుమంతరావు, ఆసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలాస మున్సిపల్ సమావేశం

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ పెన్షన్‌దారుల జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధర్మారావు

విశాలాంధ్ర-పొందూరు: రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దారుల సంఘం జిల్లా శాఖ ప్రధానకార్యదర్శిగా స్థానిక పెన్షన్ దారుల సంఘం అధ్యక్షులు అంకం ధర్మారావు ఎన్నికయ్యారు. ఆదివారం టెక్కలిలో జిల్లా సంఘం సమావేశంలో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఈ పదవికి ఎన్నికో బడ్డారు. గతంలో ఈయన జిల్లా ట్రెజరీ, లెక్కల శాఖ ఉప సంచాలకులుగా పనిచేశారు. ధర్మారావుకు ఈ పదవి వరించడం పట్ల పెన్షన్ దారులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ దారుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేయగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఆలయ నిర్మాణానికి చింతామణి ట్రస్ట్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి : కవిటి బీచ్ రోడ్‌లో నిర్మాణ పనులు చేపడుతున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి హైదరాబాదుకు చెందిన చింతామణి ట్రస్ట్ సభ్యులు లక్ష 18 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈమేరకు చింతామణి ట్రస్ట్ సభ్యులు (హైదరాబాద్ కు చెందిన) చింతామణి అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులకు పాండవ చంద్రశేఖర్ ద్వారా లక్ష 18 వేల రూపాయలు విలువచేసే బిల్డింగ్ మెటీరియల్ కొనుగోలు చేసేందుకు ఈ నగదు విరాళంగా అందజేయడం అయినదని దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.వెంకటేశ్వరరావు, ఏ.మధు, పి.ఉమా మహేశ్వర రావు, పొళ్ళాయి లక్ష్మణమూర్తి, బెందాళం రమణమూర్తి, తమరాల జయరాం, బెందాలం రంగారావు, బావన రవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో విద్యార్థిని ఆత్మహత్య

విశాలాంధ్ర-పాతపట్నం: గిరిజన పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలో విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ మహమ్మద్ యాసిన్ మరియు తాసిల్దార్ కే. రవిచంద్ర , ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కనపల అమృత (17) పార్వతీపురం మన్యం జిల్లా బామిని మండలం దిమ్మిడిజోల గ్రామానికి చెందిన కనపల మిన్నారావు కుమార్తె కనపల అమృతగా గుర్తించిన పోలీసులు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహమ్మద్ యాసిన్ తెలియచేశారు.

తైక్వాండో పోటీల్లో పలాస క్రీడాకారులు ప్రతిభ

విశాలాంధ్ర-పలాస: శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలో గల సీల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో కొన్ని చిన్నారావు మెమొరియల్ పేరిట 29వ ఓపెన్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పలాసకు చెందిన కిశోర్ స్కూల్స్ ఆఫ్ మార్షల్ ఆర్ట్సుకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చారని, కోచ్ ఎం.ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఆదివారం జరిగిన పోటీలను రాష్ట్ర రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించగా విజేతలకు వైసీపీ జిల్లా అధ్యక్షులు మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన క్రిష్ణదాసులు బహుమతులు అందజేశారని పేర్కొన్నారు. బాలుర విభాగంలో పలాసకు చెందిన డి.శివసాయి కుమార్ బంగారు పతకం, జె.సాత్విక్ 25కేజీల వెండి, బి.గీక్షత్ 35 కేజీల రజిత పతకం, అలాగే బాలికల విభాగంలో డి.యాశ్విన్ 55 కేజీల వెండి పతకం సాధించారని తెలిపారు. విజేతలను చీప్ కోచ్ నర్సిపురం శేఖర్ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అమ్మకం

విశాలాంధ్ర-కొత్తూరు... స్థానిక మండల పరిషత్ కార్యాలయం అవరణలో ప్రకృతీ సహజసిద్ధమైన సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార ఉత్పత్తులు కూరగాయల అమ్మకాల తత్కాల్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రైతు సాధికార సంస్థ ఈ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మండలంలో పండిస్తోంది ప్రతి సోమవారం మండల పరిషత్ అవరణలో ఈ కూరగాయల విక్రాలను చేస్తుంది మిగతా రోజుల్లో మెట్టూరు కేంద్రంలో ఈ సహజ సిద్ధ వ్యవసాయ ఉత్పత్తుల షాప్ తెరిచి ఉంటుంది అని నిర్వాహకులు. ఏం.టి.ఎస్ సూర్యనారాయణ తెలిపారు. యూనిట్ ఇంఛార్జి చున్నమ్మి

కింజరాపు, గౌతులను విమర్శించే అర్హత డా.సీదిరికి లేదు

ఎం.పి. నిధుల పనులను అడ్డుకుంటున్న మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-పలాస: దశాబ్దాలుగా ప్రజాసేవలు చేస్తున్న గౌతు, కింజరాపు కుటుంబాలను విమర్శించే అర్హత రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు లేదని తెలుగుదేశం పాలన కాలంలో శంకుస్థాపనలు చేసిన వాటిని నేడు మంత్రిగా ప్రారంభించి ప్రగల్భాలు పలుకుతున్నారని టీడీపీ నాయకులు విఠల్, బడ్డ నాగరాజు, గాలి క్రిష్ణారావు, లొడగల కామేష్ యాదవ్‌లు అన్నారు. సోమవారం పలాస టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పలాస ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆయన హయాంలో ఒక్క అభివృద్ధి పనులను పూర్తి చేశారా అని ప్రశ్నించారు. జిల్లా ఎం.పి కింజరాపు రామ్మోహనాయుడుకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఎం.పి నిధులతో పలాస నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తామంటే మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధికారులను బేధిరించి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. శివారు భూముల రైతులకు గత నాలుగేళ్లుగా వంశధార నీరు అందించడంలో విఫలం చెందారని, మంత్రి డాక్టర్ సీదిరి మాటల మంత్రి మాత్రమేనని, చేతల మంత్రి కాదని ఒక అసమర్థత మంత్రి అని ఎద్దేవా చేశారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గొప్ప నటుడని, రోజుకు రకరకాలుగా తమ హావభావాలు మారుస్తారని అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్నను విమర్శించిన మంత్రి ఇటీవల నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయనను పొగుడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దయాదాక్ష్యనాలతో రాజకీయాల్లోకి వచ్చి మంత్రిగా ఎదిగిన ఆయనకు సంస్కారం లేదన్నారు. తనలాగా ఎవరు చదువుకోలేదని పదేపదే చెబుతున్న మంత్రి డాక్టర్ సీదిరికి దివంగత నేత ఎర్రన్నాయుడు కుమారుడు ఇంజనీరింగ్ చేసి ఎం.బి.ఎ పూర్తి చేసిన విషయం తెలుసుకోలేకపోవడం విచిత్రమన్నారు. తండ్రి దివంగత నేత ఎర్రన్నాయుడు మృతి చెందిన సమయంలో రామ్మోహనాయుడు చదువుకుంటున్నారని,వెంటనే పార్లమెంటుకు పోటీ చేసి రెండుసార్లు ఎం.పిగా గెలిచి దేశ రాజకీయ నాయకుల్లో ఒక ముద్ర వేసుకున్నారని అన్నారు. మాజీ మంత్రి అచ్చెన్నాయుడు ఐదుసార్లుగా ఎమ్మెల్యేగా విజయం సాధించి ఒక సారి మంత్రి అయిన వెంటనే టెక్కలి నియోజకవర్గంలో గల అన్ని గ్రామాలకు రహదారులు వేసిన ఘనత ఆయనకే దక్కుతుందని, మంత్రిగా రెండేళ్లుగా పని చేసిన ఒక్క రహదారి నిర్మించలేదని ఘనత మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు దక్కుతుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే శివాజీ పలాస, మందస తహశీల్దార్ కార్యాలయాలను పూర్తి చేస్తే వైసీపీ మంత్రిగా డాక్టర్ అప్పలరాజు ప్రారంభించారని గుర్తు చేశారు. అలాగే ఉద్దానం కిడ్నీ రోగులను ఆదుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దయాలసిస్ కేంద్రాలతో పాటు కిడ్నీ ఆసుపత్రి నిర్మాణానికి అంకురార్పణ చేశారని, దానిని ఇప్పటి వరకు పూర్తి చేయలేకపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాజకీయాలు హుందాగా చేసేందుకు డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రయత్నించాలని, చౌకబారు రాజకీయాలు చేస్తే ప్రజలు పక్కన పెట్టేస్తారని అన్నారు. సమావేశంలో గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీనివాసరావు, అంబటి క్రిష్ణమూర్తి, చిట్టిబాబులు పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ అడ్రస్ వైసీపీ

- మీరా అవినీతి గురించి మాట్లాడేది
- విలేకరుల సమావేశంలో మండిపడ్డ టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-కవిటి: అవినీతికి కేరాఫ్ అడ్రస్ వైసీపీ పార్టీ అని మీరా తెలుగుదేశం పార్టీకి అవినీతి అంటగట్టేదని విలేకరుల సమావేశంలో కవిటి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మండిపడ్డారు.సోమవారం ఎమ్మెల్యే అశోక్ క్యాంప్ కార్యాలయం రామయ్యపుట్టుగలో మండల తెలుగు దేశం పార్టీ నాయకులు పొందల కృష్ణారావు, బెందాళం రమేష్, ఎస్వీ రమణ, మణిచంద్ర ప్రకాష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు పెద్దపీట వేసిన మాట పక్కన పెట్టి అక్రమ కేసులు, మర్డర్లు, మానభంగాలు చేయించడంలో వైఎస్ఆర్సిపి ప్రథమ స్థానంలో ఉందని చెప్పవచ్చని అన్నారు. సామాజిక సాధికారిక అంటే అర్థం తెలియని వారు దాని కోసం మాట్లాడే హక్కు లేదని అన్నారు. వైసిపి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కేసారని దేశం నాయకులు ఆరోపించారు. నియోజకవర్గంలో క్యాబినెట్ స్థాయి పదవులు, చైర్మన్లు, ఎమ్మెల్సీలు వారి రాజకీయ నిరుద్యోగతకు పోగొట్టడం కోసం తప్ప రాష్ట్రానికి, నియోజక వర్గానికి సూది మొన మోపినంత లాభం కూడా లేదని ఎద్దేవా చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే బెందాలం అశోక్ చేసిన అభివృద్ధిపై వైసిపి నాయకులు చర్చకు రావాలని సవాల్ విసిరారు. స్థలం సమయం చెబితే నియోజకవర్గ అభివృద్ధి కోసం చర్చించుకుందాం అని అన్నారు.తమరు చేసిన అభివృద్ధి ఏంటో మేము చేసిన అభివృద్ధి ఏంటో తేల్చుకుందాం రండి అని సవాల్ విసిరారు. రైతుల వర్షాలు లేక కరువుతో అల్లాడిపోతుంటే ప్రజలపై కత్తి పెట్టి బస్సు యాత్ర చేసుకున్న ఘనత మీకే దక్కుతుందని అన్నారు.నలుగురు మంత్రులు వచ్చి కరువు మండలంగా ప్రకటించలేకపోయారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బాసుదేవ్ రౌలో, పుల్లట రాజు, బార్ల చిన్నబాబు, బి.తిరుమల రావు, బి సురేష్, బి. విజయ్, పురుషోత్తం, ప్రగడ మని బాబు, పుల్లట సంతోష్, బాసుదేవ ప్రధాన్, కోరాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతకొండలో అధికారుల తనిఖీలు

విశాలాంధ్ర-కవిటి: గత రెండు సాధారణ సర్వసభ్య సమావేశాలలో వైస్ ఎంపీపీ పూడి నేతాజీ సీతకొండ లో బ్లాస్టింగ్ పై పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని ప్రస్తావన తేవడంతో స్పందించిన రెవెన్యూ సిబ్బంది సోమవారం సిలగాం పంచాయతీ పరిధిలో గల సీత కొండలో తాసిల్దార్ పి శేఖర్,మైనింగ్ అధికారి నాగేంద్ర, స్థానిక ఎస్సై కే రాముతో కలిసి సీత కొండను పరిశీలించి అనుమతి పత్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనింగ్ అధికారి నాగేంద్ర మాట్లాడుతూ సిలిగాం పంచాయతీ పరిధిలో పిఎస్‌కే ఇన్ఫ్రాస్ట్రక్చర్‌కు సిలగాం, బెలగాం పంచాయతీలకు సంబంధించిన 6.54 ఎకరాల భూమి లో మైనింగ్ అనుమతులు 2018&2028 సంవత్సరాలకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం తహాసిల్దార్ పి శేఖర్ సీత కొండలో మైనింగ్ అనుమతి పత్రాలు పరిశీలించి మాట్లాడారు. సిలగాం పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 91, బెలగాం పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 393 /1 లో6.54 ఎకరాల విస్తీర్ణంలో అనుమతులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సమీప గ్రామ ప్రజలు ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించడం జరిగిందని అన్నారు. క్వారీలో బాంబు బ్లాస్టింగ్ కు రెండు రోజుల ముందుగా తనకు సమాచారం అందజేస్తే సమీప గ్రామాల్లో బ్లాస్టింగ్ సమయానికి పర్యటించి ప్రత్యక్షంగా సమాచారంతో పాటు ప్రజల వద్ద నుండి కూడా సమాచారాన్ని సేకరిస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణమూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలి

- జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల సత్వరం పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక స్పందనలో వచ్చిన అర్జీలను అలసత్వం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ, వివిధ సమస్యల పై వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న స్పందన వినతుల స్వీకరణ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ఓ ఎం గణపతి రావు, డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకి చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే అర్జీలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 260 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీల స్వీకరణ అనంతరం వివిధ శాఖలలో అర్జీలపై ఆరా తీశారు. అందరు విభాగాధిపతులు ప్రజల నుంచి వచ్చే అర్జీలు పట్ల అత్యంత శ్రద్ధ వహించి పరిష్కారం చూపాలన్నారు. అర్జి పరిష్కారానికి కారణమైన అంశంపై దృష్టి సారించాలన్నారు, సరైన కారణం చూపుతూ పరిష్కారించాలన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో సిఈఓ జిల్లా పరిషత్ వెంకట్ రామన్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి బి. మీనాక్షి, ఎస్ ఇ ఇరిగేషన్ డోల తిరుమల రావు, ఎ.పి.సి సర్వశిక్ష అభియాన్ జయప్రకాశ్, పి.డి డ్వామా చిట్టి రాజు, జిల్లా విద్యాశాఖధికారి వెంకటేశ్వర రావు, డి.ఎస్.ఓ వెంకటరమణ, గృహనిర్మాణ శాఖ గణపతి రావు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కిషోర్ స్కూల్స్ అఫ్ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులకు 30 పతకాలు

విశాలాంధ్ర-టెక్కలి: 29వ జిల్లా స్థాయి ఓపెన్ తైక్వాండో పోటిల్లో టెక్కలి కిషోర్ స్కూల్స్ అఫ్ మార్షల్ ఆర్ట్స్ ఒకటి, రెండు బ్రాంచ్ల బాలు బాలికలు కలిపి మొత్తం 30 పతకాలు సాధించారని కోచ్‌లు ఎస్. సురేష్, పి. జగదీశ్వర్ రావు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళంలో గల ఆర్ట్స్ కళాశాల లో గల సిల్వర్ జూబ్లీ హాల్ లో కొన్ని చిన్నారావు మెమోరియల్ పేరిట 29వ జిల్లా స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రాష్ట్ర రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాద్ రావు ప్రారంభించగా, విజేతలకు మాజీ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ ధర్మాన కృష్ణాదాస్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలలో టెక్కలి కిషోర్ స్కూల్స్ అఫ్ మార్షల్ ఆర్ట్స్ ఒకటి మరియు రెండు బ్రాంచ్‌లు బాల, బాలికలు కలిపి మొత్తం 30 పతకాలు కైవసం చేసుకున్నారని వాటిలో 12 స్వర్ణం, 06 వెండి మరియు 09 రజత పతకం గెల్చుకున్నారని ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్షిప్ దక్కించుకున్నందుకు చీఫ్ కోచ్ నర్సిపురం శేఖర్ క్రీడాకారులకు మరియు కోచ్ ఎస్. సురేష్, పి. జగదీశ్వర్ లకు అభినందనలు తెలియజేశారు.

విధి నిర్వహణలోనే కన్నుమూత

- రైలు ప్రమాదంలో సహాయ లోకో పైలట్ దుర్మరణం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: విజయనగరం జిల్లా కంటకాపల్లి - అలమండ మధ్య ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదం ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామంలో విషాదాన్ని నింపింది. గంపెడు ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులను, భార్య బిడ్డను తీరని శోకాన్ని నింపింది. కుమారుడిని చూసి ఎంతో మురిసిపోయే ఆ తల్లిదండ్రులను తానే జీవితం అనే ముందుకు సాగుతున్న భార్య బిడ్డను ఈ ప్రమాదం కష్టాల్లోకి నెట్టేసింది. వివరాల్లోకి వెళితే. ఎచ్చెర్ల మండలం కుశాల పురం గ్రామానికి చెందిన సువ్వారి సన్యాసిరావు, అమ్మాజీ దంపతుల కుమారుడైన సువ్వారి చిరంజీవి (37) ఈఈఈ బ్రాంచ్ లో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఐదేళ్ల రైల్వే శాఖలో సహాయ లోకో పైలట్ గా చేరాడు నాలుగేళ్ల క్రితం విశాఖపట్నం జ్యోత్స్న తో వివాహమైంది. ఈ దంపతులకు భవదీప్ అనే రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఈ కుటుంబం విశాఖపట్నంలోనే ఉంటూ విధులకు హాజరవుతున్నారు ఇటీవల కాలం వరకు ఆయన విశాఖలోనే డిఆర్ఎం కార్యాలయంలోనే పనిచేస్తూ సుమారు 40 రోజుల క్రితం విశాఖపట్నం రాయగడ పాసింజర్ రైలులో సహాయ లోకో పైలట్గా బాధ్యతలు స్వీకరించాడు ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో విశాఖలో భార్య బిడ్డకు వెళ్ళొస్తానని చెప్పిన చిరంజీవి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. రాత్రి 7 గంటల సమయంలో ప్రమాదం జరిగినప్పటికీ అర్ధరాత్రి సమయం వరకు మృతి చెందిన వారిలో కొద్ది మందిని మాత్రమే గుర్తించారు ప్రమాదంలో జరిగిన రైల్లోని చిరంజీవి విధులు నిర్వహిస్తున్నాడని భార్య జ్యోత్స్నకు తెలిసినప్పటికీ మృతుల జాబితాలో పేరు లేకపోవడంతో ఎన్నో దేవుళ్లకు మొక్కుకున్నారు తీరా సోమవారం ఉదయం చిరంజీవి కూడా మృతి చెందినట్లు భార్యకు తల్లిదండ్రులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి గుండెలు బాదుకుంటూ పరుగులు తీశారు కాగా చిరంజీవి మృతదేహాన్ని స్వగ్రామమైన కుశాలపురం సాయంత్రం తీసుకురాగా కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తులు స్నేహితులు అశ్రునైనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు.

కంటకాపల్లి రైలు ప్రమాదంలో బొడ్డేపల్లివాసికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-పొందూరు : కొత్తవలస సమీపంలో అలమండ-కంటకాపల్లి మధ్య జరిగిన రైలు ప్రమాదంలో మండలం బొడ్డేపల్లికి చెందిన బొడ్డేపల్లి తేజేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. పనిమీద విశాఖపట్టణం వెళ్ళి డిఎంయూలో తిరిగివస్తుండగా రైలు ప్రమాదాని గురవ్వడంతో గాయాలపాలయ్యాడు. తీవ్రంగా గాయాలయిన తేజేశ్వరరావును విశాఖ పట్టణంలోని రైల్వే ఆసుపత్రిలో చికిత్స నిర్వహిస్తున్నారు. ప్రమాదానికి గురై గాయాల పాలైనట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి చేరుకున్నారు. చికిత్స అందించడంతో తేరుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఢిల్లీకి చేరిన కోటబొమ్మాళి మట్టి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: దేశ ప్రధానిమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు నాభూమి- నాదేశం కార్యక్రమంలో భాగంగా ఢిల్లిలో అమృతసరోవనం నిర్మించడం కోసం కోటబొమ్మాళి ఎన్ఆర్ఈజీఎస్ వారు సేకరించిన మట్టి సోమవారానికి ఢిల్లి చేరుకుంది. మండలంలోగల 38 గ్రామ పంచాయతీల పరిదిలోగల ఉపాధి క్షేత్రసహాయకులు సేకరించిన మట్టిని ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్, ఉపాధిహామి ఏపీవో జి. హరిప్రసాద్‌లు ఎత్తురాళు పాడు పంచాయతీకి చెందిన ఉపాధిహామీ క్షేత్రసహాయకుడు ఎన్, షన్ముఖరావుతో ఢిల్లికి పంపించారు.

ఎంతో హాయి... జగనన్న మందు

విశాలాంధ్ర-పోలాకి: ఆల్కహాల్‌తోనే ఆనందంగా ఉన్నట్లు జగనన్న మందు ఎంతో హాయిగా ఉన్నట్లు మందుబాబులు ఊగుతూ తూగుతూ నిద్రిస్తున్నారు. సోమవారం పోలాకి ప్రధాన కేంద్రంలో రైస్ మిల్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో మందుబాబు హాయిగా నిద్రిస్తున్నాడు. అందుబాటులో వైన్ షాప్ ఉండడంతో మందుబాబులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యం కలుగుతుంది. దింతో తాగేవారికి తాగినంతగా దొరుకుతూ.. ఊగేవారు ఊగుతూ ఇలా నిద్రిస్తున్నవారు. తమకు ఇబ్బంది కలుగుతుందని ముందుగా చెప్పిన మందుబాబు వినలేదని మత్తు ఎక్కువై ఇలా నిద్రిస్తున్నాడని దుకాణ యజమానులు తెలిపారు.

ఎండిన వరి పొలాల పరిశీలన

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: నారాయణపురం కుడికాలు కింద ఎచ్చెర్ల మండలంలోని శివారు గ్రామాలైన ముద్దాడ, కొంగరం గ్రామాల్లో ఎండిన వరి పొలాలను వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె త్రినాథ స్వామితో కూడిన బృందం సోమవారం పరిశీలించింది. గ్రామాల్లోని పంట పొలాలు ఉన్నప్పటికీ ఇటు వర్షాలు లేక అటు కాలువ ద్వారా సాగునీరు సరఫరా కాక ఎండి పోతున్నాయి. ఈ విషయాన్ని పలుసార్లు స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు క్షేత్ర పరిశీలనలో గుర్తించిన విషయాన్ని నివేదిక రూపంలో జిల్లా ఉన్నతాధికారులకు తీసుకెళ్తా మన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కే కృష్ణారావు, సిహెచ్ వెంకటరావు, జిల్లా వనరుల కేంద్రం ఏడి బి రజని, మండల వ్యవసాయ అధికారి వై సురేష్, మాజీ ఎంపీటీసీ బెండు రామారావు తదితరులు పాల్గొన్నారు.

అమరులైన కుటుంబాలను డిఎస్పి బాలచంద్ర రెడ్డి పరామర్శ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరులైన పోలీసు కుటుంబాలను డిఎస్పి బాలచంద్ర రెడ్డి సోమవారం పరామర్శించారు. జిల్లా ఎస్పీ శ్రీమతి జి.ఆర్ రాధిక పర్యవేక్షణలో జరుగుతున్న అమరవీరుల స్మారక వారోత్సవాలలో భాగంగా శత్రుముకల దాడిలో జిల్లాకు చెందిన అమరులైన ఎం.నరేంద్రదాస్, ఏ.పాపరావు వారి కుటుంబాలను శ్రీకాకుళం పట్టణంలోని వారి స్వగృహంలో వారి కుటుంబ సభ్యులను డిఎస్పి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంలో అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని. పోలీసు శాఖకు దాస్, పాపారావు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. వారి ఆత్మకు శాంతి కలగాలని తెలిపుతూ జ్ఞాపికలను అందజేశారు.

శ్రీకాకుళం జిల్లా వలస కూలి మృతి

విశాలాంధ్ర-నందిగాం : మండలం శివరాంపురం పంచాయతీ కోటిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద తాడేల కృష్ణారావు గ్రామంలో బ్రతుకు దెరువు లేక హైదరాబాదు వలస వెళ్లి కూలీగా వెళ్లాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతీరోజు వలే ఆదివారం కూలి పనికి వెళ్లి భవంతిపైన పెయింట్ పనులు చేస్తుండగా బిల్డింగ్ మీద నుంచి జారిపడి అక్కడక్కడ మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మృతుడి కుటుంబం కన్నీరుగా వినిపిస్తున్నారు. మృతుని భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

నిరుపేదలకు భరోసా వైఎస్సార్ భీమా

సర్పంచ్ పూడి లక్ష్మణరావు

విశాలాంధ్ర-కవిటి : వైయస్సార్ భీమా పథకం నిరుపేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందని సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని కవిటి చెందిన నెయ్యల రమేష్ (45) అనారోగ్యంతో మృతి చెందాడు.మృతుడు వైఎస్ఆర్ బీమా పథకంలో సభ్యుడిగా ఉన్నందువల్ల తక్షణ సహాయం కింద పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు చేతుల మీదుగా మృతుడు భార్య నెయ్యాల మాధురి బెహరా కు అందజేశారు. మిగిలిన మొత్తం 90 వేల రూపాయలు నామిని ఖాతాలో జమ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పూడి నీలాచలం, వెల్ఫేర్ అసిస్టెంట్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమం : పేరాడ తిలక్

విశాలాంధ్ర-నందిగాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల సంక్షేమం జరుగుతుందని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. సోమవారం నందిగాం మండలంలోని శివరాంపురం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కిల్లి కృపారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా పేరాడ తిలక్, కృపారాణిలు మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి పేదవాడికి సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందజేయడంతో పాటు వైద్యంపై పూర్తిస్థాయి దృష్టి సారించి పల్లెల్లో ఇంటింటికి వైద్యులను పంపించి పేదవాడు ఆరోగ్యం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ప్రజలంతా శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన స్టాల్స్ ను డ్వాక్రా వస్తు ప్రదర్శన పరిశీలించారు. వృద్ధులకు కళ్లద్దాలు, రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాలక మధుసూదన్, సర్పంచ్ సబ్బి జానకిరామ్, మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు, ఎంపీటీసీ సభ్యులు పిన్నింటి జయరాం, అంబోడి విష్ణు ఎంపీడీవో శివప్రసాద్, డిప్యూటీ తాసిల్దార్ ధనలక్ష్మి, సంబాన దానయ్య, బొమ్మాళి గున్నయ్య, వైఎస్సార్సీపి నాయకులు, వైద్యశాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సెక్రెటరీ రవికుమార్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో కరాటే క్రీడాకారులు ప్రతిభ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : నిరంతరం శిక్షణ పొందుతూ ఉన్నప్పుడే విజయం వైపు నడిచేందుకు ఆస్కారం ఉంటుందని జేఎన్టియు సెనేట్ మెంబర్ దుప్పల వెంకటరావు అన్నారు. శిక్షణ పొందినంత మాత్రాన విజేత కాలేరని, క్రీడాకారులు నిరంతరం అభ్యసిస్తూ మెళకువలు నేర్చుకున్నప్పుడే పతకాలు అందుకుంటారన్నారు. మాస్టర్స్ సాయిబాబాస్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఇటీవల హైదరాబాద్లో జరిగిన రెండో అంతర్జాతీయ డ్రాగన్ ఫీస్ట్ జోటోకాన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నగరంలోని అఫీషియ్ కాలనీ ఏపీజే అబ్దుల్ కలాం పార్క్ దుప్పల వెంకటరావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెడల్స్ సోమవారం అందజేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ సిక్కోలు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పథకాలు అందుకున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని కరాటే క్రీడాకారులు ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, కొంక్యాన మురళీధర్, హనుమంతు కృష్ణారావు సతీమణి తులసమ్మ ను సత్కరించారు. రిటైర్డ్ డీసీటీవో కామరాజు, రిటైర్డ్ ఎస్బిఐ మేనేజర్ జగన్నాథరావు, ఇరిగేషన్ అధికారి జ్ఞానభాస్కరేవ్, అసోసియేషన్ అధ్యక్షుడు, చీఫ్ కోచ్ చంద్రరావు, కోచ్ గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట రోటరీకి అరుదైన గౌరవం

డైమండ్ అవార్డు అందుకున్న అధ్యక్షుడు శ్రీనివాస్

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట రోటరీక్లబ్ అరుదైన అవార్డును సొంతం చేసుకుంది. రోటరీక్లబ్ అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా రోటరీ ఇంటర్నేషనల్ ట్రస్ట్ వైస్‌చైర్మన్ భరత్‌పాండ్య చేతుల మీదుగా డైమండ్ అవార్డును దక్కించుకున్నారు. ఈ అవార్డు ప్రధానోత్సవం ఆదివారం రాత్రి విశాఖపట్నంలో జరిగింది. ఈ మేరకు సోంపేట రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాస్ సోమవారం మాట్లాడుతూ సోంపేట రోటరీక్లబ్ అందిస్తున్న విశేష సేవలను గుర్తించి గౌరవించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రోటరీ క్లబ్ చేపడుతున్న రక్తదాన కార్యక్రమాలు, బడుగు, బలహీనవర్గాల మహిళలకు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉపాధి కల్పించడం, కాలుష్య నివారణలో భాగంగా మొక్కలు నాటడం ఇలా ఎన్నో కార్యక్రమాలతో చురుగ్గా సేవలందిస్తున్నందుకు ఈ అవార్డు లభించిందని పేర్కొన్నారు. సోంపేట రోటరీక్లబ్‌కు డైమండ్ అవార్డు లభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కర్ణాటక ప్రతినిధి తిరువన్నాయుడు, జిల్లా గవర్నర్ దత్త, సెక్రటరీ పి.వి.కృష్ణారావు, క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

కళలను గుర్తించి గౌరవిస్తాం

విశాలాంధ్ర -పోలాకి : జానపద ప్రాచీన కళలను గుర్తించి గౌరవిస్తామని సమరసత సేవా ఫౌండేషన్మండల కోఆర్డినేటర్ కరుకోల సీతారాం తెలిపారు. సోమవారం ప్రియాగ్రహారం లో విశాలాంధ్రతో మాట్లాడారు. ముఖ్యంగా నవంబర్ నెల 9వ తేదీన జరగబోయే హిందూ సమ్మేళనం విషయం పైన చర్చించడం జరిగిందని అన్నారు. పోలాకి మండలం లో మొత్తం 31 పంచాయతీలు కు 12 పంచాయతీల నుండి 23 మంది సభ్యులు తో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గాతలవలస చెల్లాయివలస డోల పల్లిపేట పోలాకి మగతాపాడు రహమాన్ పురం ఈదులవలస గుల్లవానిపేట

ప్రియాగ్రహారం గొల్లలవలస అంపలాం పంచాయతీల నుండి సభ్యులు హాజరైనట్లు చెప్పారు.జరగనున్న హిందూ సమ్మేళనం లో సమరసత సేవా ఫౌండేషన్ ఏ లక్ష్యంతో ముందుకు వెళ్ళాలనే విధంగా చర్చించడం జరిగిందన్నారు.సమావేశం లో అందరూ ముందు వివిధ రకాల హిందూ కళాకారుల విద్యలను గుర్తించటం, వాళ్ళందరినీ చైతన్యం కలిగేటట్లు చర్యలు తీసుకొనున్నట్లు చెప్పారు.

ఘనంగా దీపారాధన

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రత్తకన్న నాయుడు వీధిలో గజలక్ష్మి నవరాత్రుల్లో భాగంగా సోమవారం ఘనంగా పూజలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి మండపానికి ఎదురుగా కుంభం ఆకృతిలో రెండువేల దీపాలతో అలంకరణ జరిపారు. అత్యంత రమణీయంగా దీపాలంకరణ సేవను జరిపారు. దేదివ్యమానంగా వెలుగుతున్న దీపకాంతులను చూడటానికి చుట్ట ప్రక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. లక్ష్మి స్వరూపంగా భావించే దీపాలతో అమ్మవారికి కొలవడం ద్వారా ప్రసన్నురాలవుతుందనేది అక్కడి ప్రజల విశ్వాసం.

నాణ్యమైన విద్యతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : నాణ్యమైన సాంకేతిక విద్యతోనే యువతకు మెరుగైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. జేఎన్టీయూ (విజయనగరం) పాలకమండల సభ్యునిగా నియమితులైన దుప్పల వెంకటరావును శ్రీ శివాని ఇంజనీరింగ్ కళాశాల చిలకపాలెంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న వెంకటరావు పాలకమండల సభ్యునిగా సాంకేతిక విద్య బలోపేతానికి మరిన్ని చర్యలు తీసుకోవాలన్నారు సన్మాన గ్రహీత దుప్పల వెంకటరావు మాట్లాడుతూ పాలకమండలి సభ్యుడిగా మరింత బాధ్యతగా నిర్వర్తిస్తానన్నారు ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఈ ఈ పొగిరి సుగుణాకర రావు శివాని యాజమాన్య ప్రతినిధులు పి దుర్గాప్రసాద్ రాజు కే దుర్గా శ్రీనివాస్ సాయినాథ్ రెడ్డి ఎస్ శ్రీనివాస్ డాక్టర్ దానేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏ.టి.యమ్ మోడల్‌ను సందర్శించిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం కేశవరావు పేట గ్రామంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి పర్యవేక్షణలో ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ మరియు మెంటార్స్, ఫార్మర్ సైంటిస్ట్స్, మోడల్ మేకర్స్ సిబ్బంది ఏ.టీ.ఎం పద్ధతిలో సాగుచేసిన కూరగాయల మోడల్‌ను క్షేత్రస్థాయిలో సందర్శన చేశారు. ఈ సందర్భంగా హేమసుందర్ మాట్లాడుతూ నిత్యం ఆదాయం వచ్చే కూరగాయల బహుళ పంటల విధానంలో సాగు చేసుకునే విధానాన్ని రైతులతో క్షేత్రస్థాయిలో చేస్తున్నామని తెలిపారు. తయ సిబ్బంది అందరితో కూడా మోడల్ వేసే విధానాన్ని డెమో ప్లాట్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చంద్రబాను, శ్రీనివాస్, గోవింద్ రెడ్డి, లక్ష్మనాయుడు పాల్గొన్నారు.

దువ్వాడ వికృత చేష్టలను ఖండించిన తెదేపా నాయకులు

సబ్ కలెక్టర్, డి.ఎస్.పి.కి ఫిర్యాదు

విశాలాంధ్ర-టెక్కలి : టెక్కలి పట్టణంలో ప్రకృతి పరిరక్షణలో భాగంగా టెక్కలి పాత జాతీయ రహదారి డివైడర్ మధ్యలో తెలుగుదేశం హయాంలో మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఏర్పాటుచేసిన చెట్లను అధికార మదంతో తన పుట్టినరోజు వేడుకలకు ఫ్లెక్సీల ఏర్పాటు కోసం చెట్లను కొట్టించేస్తున్న దువ్వాడ శ్రీనివాస్ వికృత చేష్టలను టెక్కలి తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సంద ర్భంగా పార్టీ నాయకులు టెక్కలి డి.ఎస్.పి, టెక్కలి సబ్ కలెక్టర్‌కు సోమవారం పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత ఎన్ హెచ్ 5 రహదారి మధ్యలో చెట్లను అధికార మదంతో తన పుట్టినరోజు వేడుకల ఫ్లెక్సీల ఏర్పాటు కోసం చెట్లను కొట్టించేస్తున్న వారి పైన వెంటనే చర్యలు తీసుకోవలని గత నాలుగున్నర ఏళ్లగా ఎండల తాకిడికి ఎండిపోయిన మొక్కలకు కనీసం నీరు కూడా పొయ్యని వారు ఈరోజు పుట్టినరోజు వేడుకల ఫ్లెక్సీల కోసం పచ్చని చెట్లను నరుకు తున్నారని, పుట్టినరోజు అంటే ఎవరైనా మొక్కలను నాటుతారు. తల్లి లాంటి పచ్చని చెట్లను నరకటం ఎంతవరకు సబువని అన్నారు. మార్చి 26వ తేదీన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి నియోజకవర్గ శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలుకు ఫ్లెక్సీలు కడితే ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతుంది అని మా ఫ్లెక్స్ లను తీయ్యటం జరిగిందని ఇప్పుడు వాళ్ళ ఫ్లెక్స్‌లు కట్టడానికి అనుమతి ఇవ్వకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్కలి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు,కోళ్ల లవకుమార్, రేయ్యు ప్రీతీష్ చంద్ర, దల్లి ప్రసాద్ రెడ్డి, బుడంకాయల అభిలాస్, ప్రఫుల్ల పరిడ, సోదుముడి శివకిరణ్, లైశెట్టి దుర్గారావు, లక్ష్మణ్, ఉమా, టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షలో పేరు నమోదు అయితే వైద్యం ఉచితం

- రాష్ట్ర కళింగ కర్పోరేషన్ చైర్మన్ తిలక్, టెక్కలి వైకాపా సమన్వయకర్త వాణి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగుల పేరు నమోదు అయితే జగనన్న ముఖ్యమంత్రి ఉన్నంతవరకు ఎంత పెద్ద రోగానికైనా మీకు నచ్చిన కార్పోరేటు ఆసుపత్రిలో వైద్యం ఉచితంగా అందజేయటం జరుగుతుందని రాష్ట్ర కళింగ కర్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణిలు అన్నారు. సోమవారం మండలం మాసాహెబ్‌పేట సచివాలయం పరిధిలో సర్పంచ్ సంపతిరావు ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన వారు పాల్గొని రోగులు, వైద్యులుతో మాట్లాడి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలకు కార్పోరేట్ సాయి వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమని అన్నారు. ప్రజల ఆరోగ్య స్థితిగతులను జల్లెడపట్టి వారి ఇష్టం మేరకు పరీక్షలు నిర్వహించి వైద్యం చేయించడం, వైద్య నిపుణులతో ఆరోగ్యం పట్ల సలహాలు, సూచనలు అందించటం జరుగుతుందన్నారు. గ్రామాలలో ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించి వారిని ఆరోగ్య వంతులుగా ఉంచడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అంగన్వాడీలు పౌష్టిక ఆహారప్రదర్శనలను నిర్వహించారు. గర్భవతులు తీసుకోవాల్సిన ఆహారం గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ జగనన్న సురక్షలో 302మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయటం జరిగిందని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు, రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఆర్. మధు, మండల విద్యాశాఖాధికారి ఎల్.వి. ప్రతాప్, వైకాపా నాయకులు పేడాడ వెంకటరావు, గద్దవలస నాగభూషణరావు, మండల వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా పని చేద్దాం

- భువనేశ్వరి పర్యటన విజయవంతం చేయాలి
- టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస: తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులంతా కలిసికట్టుగా పనిచేసిన నాడు విజయం మనదే అని, అందుకు ప్రతి ఒక్కరూ సమ న్వయ ముతో వ్యవహరించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం శ్రీనివాస కళ్యాణ్ మండపంలో జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు కారణంగా ఎంతో మంది అభిమానులు మృతి చెందిన విషయం తెలిసినదే అన్నారు. వైసీపీ చేస్తున్న అరా చకాలను అక్రమాలను ప్రజలకు వివరించి వారి మద్దతు కోరాలని పిలుపునిచ్చారు. ఒకటో తేదీన బాబు అక్రమ అరెస్టుతో తల్లడిల్లు మృతి చెందిన నియోజకవర్గంలోని నాలుగు కుటుంబాలను ఓదార్చేందుకు మహిళా నాయకురాలు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి దేవి పర్య టించనున్నారని ఈ పర్యటనను విజ యవంతం చేయాలని కోరారు. ఆముదాల వలసలోని పాత నిమ్మ తోర్లవాడ కు చెందిన ఆకేటి పారయ్య, గొండు ఎర్రయ్య లు బాబు అక్రమ అరెస్టుతో మనస్థాపానికి గురై గుండె పోటుతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించ నున్నారు. అలాగే దన్నాన్న పేటకు చెందిన గొర్రెల తిరుపతిరావు గుండె పోటుతో మృతి చెందారు ఆ కుటుంబాన్ని కూడా ఆమె పరామర్శించి ఉన్నారని నియో జకవర్గము నుంచి పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొని వైసిపి దురాహంకారానికి చరమ గీతం పాడాలన్నారు. సమావేశంలో గ్రామాల్లో జరుగుతున్న వలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఓటర్ జాబితాలను ఎప్పటి కప్పుడు సరి చేసుకోవాలని దీనిపై ప్రతి ఒక్కరూ నిత్యం నిఘా ఈ ఏర్పాటు చేయాల న్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేసి ప్రతి ఇంట తెలుగుదేశం పార్టీ జెండా ఎగిరేల కృషి చేయాలి అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగుర వేశాల అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, పి ఎం జె బాబు, మొదల వలస రమేష్, బోర గోవిందరావు, తమ్మినేని చంద్రశేఖర్, విద్యాసాగర్, చాపర విజయ లక్ష్మి, మెట్ట సుజాత, బోయిన సునీత, సనపల ఢిల్లేశ్వరావు, నూక రాజు, శివాల సూర్యం, సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ అన్ని స్థాయి సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మ పరిశీలన చేసుకోవాలి

విశాలాంధ్ర- ఇచ్ఛాపురం : నియోజకవర్గంలో వై.సి.పి పార్టీకి వస్తున్న ఆదరణ చూసి తెలుగుదేశం పార్టీ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ ఛైయిర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి తదితరులు అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం ఛైయిర్‌పర్సన్ కార్యాలయంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆత్మ విమర్శ చేసుకుని మాట్లాడాలని వారు కోరారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా సురంగి రాజా మైదానంలో సభకు హాజరైతే ఆర్పీలను భయపెట్టి మీటింగ్‌కు రాని వారికి పసుపు కుంకుమ సొమ్ములు జమ కావని భయపెట్టలేదా? అప్పుడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ పాలనకు మెచ్చి సామాజిక సాధికార యాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తే బలవంతంగా తరలించామనటం భావ్యం కాదని అన్నారు. తప్పులు చేసి ఇతరులపై వాటిని నెట్టడం తెలుగుదేశం పార్టీ నాయకులకు అలవాటైపోయిందని విమర్శించారు. నాలుగున్నరేళ్ళలో మున్సిపాలిటీకి ఎటువంటి అభివృద్ధి జరగలేదన్న ఎమ్మెల్యే రెండు దఫాలు తాను శాసనసభ్యునిగా ఎన్నికై ఏమి చేసారో చెప్పగలరా అని ప్రశ్నించారు. పింఛన్లను పెంచి అందివ్వడం, వివిధ రకాల సంక్షేమ పథకాలు, ప్రతీ ఒక్క కుటుంభానికి ఇళ్ళు ఉండాలనే లక్ష్యంతో ఇళ్ళ నిర్మాణాలు జవిరిస్తుండటం అభివృద్ధి కాదా అన్ని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ప్రజల గుండెల్లో నిలిచిన వై.ఎస్.జగన్మోహన్ ను విమర్శించే అర్హత ఎమ్మెల్యేకు లేదని, వై.సి.పి నాయకుల సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ఫలితంగానే పెద్ద సంఖ్యలో జనాలు వచ్చి బస్సు యాత్ర, సభను విజయవంతం చేసారని ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ దుక్క లోకేశ్వర రావు, సచివాలయాల సమన్వయకర్త సాలిన డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

కారణజన్ముడు కిరణ్‌చంద్ : ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణానికి చెందిన మలిపెద్ది కిరణ్‌చంద్ ఆరుగురికి అవయవ దానం చేసి కారణజన్ముడుగా నిలిచిపోయి మనమధ్యలోనే ఉన్నాడని అతని జన్మదినాన్ని పురస్కరించుకుని సంబంధిత తల్లిదండ్రులు ఏర్పాటుచేసిన ఉచిత మోగా వైద్య శిబిరంలో సోంపేట ఎంపీపీ డాక్టర్ ఎన్.దాసు పాల్గొని కొనియాడారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో గత ఏడాది కిరణ్‌చంద్ అనారోగ్యంతో మృతి చెంది ఆరుగురు కుటుంబాలకు అవయవ దానాలు చేసి కారణజన్ముడుగా నిలిచిన కిరణ్‌చంద్ 16వ జన్మదిన వేడుకల సందర్భంగా సంబంధిత తల్లిదండ్రుల ఆధ్వర్యంలో జేమ్స్ ఆసుపత్రి వైద్య బృందం సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పట్టణంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ముఖ్యఅతిథిగా ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు పాల్గొని కిరణ్‌చంద్ తల్లిదండ్రులకు ఘనంగా సన్మానిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కిరణ్‌చంద్ తల్లిదండ్రులకు అభినందిస్తూ ప్రభుత్వం తరపున ఏప్రిషియేట్ ధృవీకరణపత్రాన్ని అందజేస్తూ కిరణ్‌చంద్ మన మధ్యలోనే ఉన్నాడని, మీ కుమారుడు కారణజన్ముడని కిరణ్‌చంద్ తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదని ఆయన పేర్కొన్నారు.

అనంతరం పెద్దసంఖ్యలో రోగులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఉచితంగా మందులు పొందారు. ఈ కార్యక్రమంలో జెమ్స్ ఆసుపత్రి వైద్య బృందం డాక్టర్ కె.సాహిత్య, డాక్టర్ నవ్య, డాక్టర్ బి.తేజ, సోంపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ విశ్రాంత ఉపాధ్యాయురాలు నగిరి ప్రభావతమ్మ, ఉపసర్పంచ్ మల్లా వెంకటరమణ, కోల తిరుపతి, క్రాంతి శ్రీను, బత్తుల షన్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

బైరిపురంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బైరిపురం గ్రామంలో ఏఎంసి ఉపాధ్యక్షుడు ఎలమంచి నీలయ్య ఆధ్వర్యంలో పట్టాదారు పాస్ పుస్తకాలు రెవెన్యూ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నీలయ్య మాట్లాడుతూ భూ యాజమాన్యకు హక్కు పత్రాలు పంపిణీ ద్వారా గ్రామాల్లో భూ తగాదాలు తగ్గుముఖం పడతాయని అన్నారు. బైరిపురం గ్రామంలో 1018 ఎకరాలకు గాను 489 మంది రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మల్లికార్జున పాణిగ్రాహి, ఎంపీటీసీ ప్రతినిధి పిరియ ఆనంద్, గ్రామస్తులు పుల్లట జగదీష్, వై సత్యం, పి వైకుంతరావు, పి రామచంద్ర రావు, కడియాల సాయి, పుల్లట సత్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి ఉంగ ప్రవీణ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పలాస ఎంపిడివో రమేష్‌నాయుడు ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసి, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారం పై ప్రజలకు అవగాహన కల్పించాలి

- రాష్ట్ర కళింగ కర్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : అంగన్వాడీ కేంద్రాలు ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారం గూర్చి వివరించి లబ్ధిదారులకు అందజేయాలని రాష్ట్ర కళింగ కర్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. సోమవారం కమలనాభపురం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని అక్కడ ఏర్పాటు చేసిన అంగన్వాడీ పౌష్టిక ఆహార ప్రదర్శనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ స్టాల్‌లో ఉన్న సూపర్‌వైజర్‌కు ప్రభుత్వం అందజేస్తున్న పాల ప్యాకెట్ విలువ ఎంత ఉంటుందని తిలక్ అడుగగా ప్రభుత్వం మాకు అందజేస్తుంది, లబ్ధిదారులకు మేము అందజేస్తున్నాము దాని రేటు మాకు తెలియదు అని చెప్పడంతో తిలక్ మాట్లాడుతూ మీరు రేషన్ డీలర్లు కాదని ప్రభుత్వం ఇచ్చినది అలాగే ఇవ్వటానికి, గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు ఇవి అందజేసినప్పుడు ఈ ప్యాకెట్ ఇంత విలువ చేస్తుంది, ఇది వాడడం వల్ల ఈ రకం మేలు జరుగుతుందని మీకు లబ్ధిదారులకు చెప్పాలని అలా చెప్పిన నాడే వారు పౌష్టికాహారం పూర్తి స్థాయిలో వినియోగిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సర్పంచ్ సంపతిరావు ధనలక్ష్మి , వైకాపా నాయకులు పేడాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.